# ప్రేమ కోరేది...

-యం.ఓ.యస్హాక్

''ప్రేమ దేన్ని కోరుతుంది?'' అడిగారు నాన్నగారు.

నా ప్రేమ విషయం తెలియగానే మండిపడతారనుకున్న ఆయన శాంతంగా అలా అడిగేసరికి తికమకపడుతూ ''త్యాగాన్ని'' అన్నాను నేను.

''అయితే నువ్వు త్యాగం చేయి ఆ అమ్మాయిని'' నింపాదిగా అన్నారు.

''నాన్నా!'' అంతకుమించి నా నోరు పెగల్లేదు.

''నువ్వు ఒక నిరుపేద అమ్మాయిని ప్రేమించావని నేను బాధపడడంలేదురా. పర మతం అమ్మాయిని ప్రేమించావే అది నువ్వు చేసిన తప్పు. మన మతానికి చెందిన పేదింటి అమ్మాయిని నువ్వు ప్రేమించి ఉన్నా వైభవంగా నీ పెళ్లి జరిపించేవాడ్ని. మంత్రి నారాయణ రావు ఒక పేదింటి అమ్మాయిని కోడలిగా తెచ్చుకున్నాడని నాకూ పేరొచ్చేది. ముఖ్యమంత్రిగారు నాకు ప్రత్యేకంగా దేవాదాయ శాఖ ఎందుకిచ్చారో తెలుసా? నా నిలువు నామాలను స్నానం చేసేటప్పుడు కూడా తుడవనన్న సంగతి ఆయనకు తెలుసుకాబట్టి. వైష్ణవం నా శరీరంలో ఒక భాగమైపోయింది. మన సంప్రదాయాలూ, ఆచారాలూ దానిపట్ల నాకువున్న నిబద్ధతా తెలుసు కాబట్టి. ప్రతి మంత్రినీ ఏక వచనంతో సంబోధించే ఆయన నన్ను మాత్రం నారాయణరావుగారూ అంటూ గౌరవంగా ఎందుకు పిలుస్తారో తెలుసా? గాయత్రి మంత్రమే నాకు ఊతపదమని ఆయనకు తెలుసు కాబట్టి. అట్లాంటి నేను ఒక పర మతం అమ్మాయిని కోడలిగా స్వీకరిస్తే నా పరువేం అవుతుందో ఆలోచించావా? ఈ లోకం గురించి కాకున్నా పర లోకంలో వున్న మీ అమ్మ ఆత్మ ఎంతగా క్షోభిస్తుందో కూడా నువ్వు ఆలోచించలేకపోయావా?''

''అమ్మా!'' ఆ మాట వినగానే నా ఆలోచనలు గతం వైపుకు మళ్ళాయి.

నాకు సరిగ్గా ఊహ తెలియక ముందే అమ్మ యక్సిడెంట్‌లో చనిపోయింది. నాన్నగారు మరో పెళ్లి చేసుకున్నారు. ఆ వచ్చినామె ఆయనకు భార్య అయిందేగానీ నాకు తల్లి కాలేకపోయింది. హకీం మా నాన్నగారి దగ్గర పని చేస్తున్నవాళ్లల్లో అత్యంత నమ్మకస్తుడని పేరు తెచ్చుకున్నాడు. ఆయన, తన భార్య ముంతాజ్ బేగం, కూతురు మల్లికాబేగంతో కలసి మా అవుట్ హౌస్‌లో ఉండేవాళ్ళు. నేను మా పిన్ని దగ్గరకన్నా ముంతాజ్ బేగం దగ్గరే ఎక్కువగా ఉండేవాడ్ని. ఒక ఆయాలా కాకుండా ఒక అమ్మలా నన్ను పెంచింది ఆమె. స్నానం చేయించడం, బట్టలు తొడగడం, స్కూలుకు పంపించడం అచ్చం అమ్మలాగే చేసేది.

నాన్నగారు అప్పుడప్పుడే రాజకీయాల్లో ఎదుగుతున్నారు. ఆయనకు ఇదంతా పట్టించుకునే తీరిక ఉండేదికాదు. పిన్నికి క్లబ్బులు, షికార్లతో సరిపోయేది.

ఒకరోజు నాన్నగారు ఏదో పనిమీద ఊరికి వెళ్లారు. పిన్ని వాళ్ళ ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ అంటూ వెళ్లిపోయింది. దానికిముందు రోజు నేను కొద్దిగా వర్షంలో తడిసి ఉండడంచేత జ్వరం వచ్చేసింది. అయినా పట్టించుకోకుండా మల్లికతో ఆడుకుంటున్నాను. వున్నట్టుండీ స్పృహ తప్పి పడిపోయాను. మల్లిక కెవ్వున అరుస్తూ వెళ్లి వాళ్లమ్మను పిల్చుకొచ్చింది. అప్పుడు ఆ మహాతల్లి చేసిన సేవ నేను జీవితాంతం మరువలేను. డాక్టర్ వచ్చి ఇంజెక్షన్ ఇచ్చి వెళ్లిన తరువాత మాత్రలు మింగించింది. ఆ చేదుకో ఏమో ఆమె మీద కక్కేసాను. ఆమె ఏమాత్రం అసహ్యించుకోలేదు.

నా ముఖాన్ని తన పైట కొంగుతో తుడిచింది. కన్నతల్లిలా ఆందోళన పడింది. ఆ రాత్రంతా నాకు సపర్యలు చేసింది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే మల్లిక కూడా దిగులుగా ఒక మూల కూర్చుంది. అలా వారి కుటుంబంతో నా బంధం గట్టిపడసాగింది. ముంతాజ్ బేగం ఇంటి ముందు కళ్లాపి జల్లేది. మల్లిక చక్కని ముగ్గులేసేది. వారి ప్రతి పనిలోనూ తెలుగుదనం ఉట్టిపడేది. బహుశా నేను మల్లికపట్ల ఆకర్షితుడినయ్యేందుకు అది కూడా ఒక కారణం అయి ఉండవచ్చు. అప్పుడు నేను ఇంటర్ ఫైనల్‌లో ఉన్నాను. అనుకోకుండా ఒకసారి మల్లిక పుస్తకాలు చూసాను. అందులో రాముడి ఫోటో ఒకటి భద్రంగా కనిపించింది.

''అదేమిటి మా దేవుడి ఫోటో నువ్వు పెట్టుకున్నావు?'' అడిగాను.

''రాముడు మీకు మాత్రమే దేవుడా? అలా అనుకోవడం స్వార్థం అవుతుంది. ఆయన పురుషో[illegible] సర్వజనానికి ఆదర్శ పురుషుడు'' అంది.

స్త్రీ పురుషుడికంటే ఎంత త్వరగా పరిణితి [illegible]తుందో అప్పుడు అర్థమైంది నాకు. ఒకసారి తనకో [illegible]వద్గీత తెచ్చి పెట్టమని అడిగింది.

''ఎందుకు? నువ్వు రోజూ ఖురాన్ చదువుతున్నావుగా?'' అడిగాను.

''నాకు గీత కూడా చదవాలని వుంది.''

సరేనని తెచ్చిచ్చాను. చదివాక అడిగాను ఎలాగనిపించింది అని.

''నాకు ఖురాన్‌కు, గీతకు ఎంతమాత్రం తేడా కనిపించలేదు'' అంది.

అప్పుడప్పుడే ఆమెలో యవ్వనం చిగురిస్తుండేది. పైటా పావడా ధరించి పదహారణాల తెలుగింటి అమ్మాయిలా ఉండేది.

రోజూ మేము మా తోటలో కలుసుకునేవాళ్ళం. నేను మొక్కలకు నీళ్ళు పోస్తుంటే ఆమె కలుపుమొక్కలు ఏరుతూ ఎన్నో కబుర్లు చెప్పేది. వయసుకు మించిన పరిపక్వత కనిపించేది ఆమె మాటల్లో.

''శ్రీనూ! గీత, ఖురాన్ రెండింటిలోనూ ధర్మాధర్మాల ప్రస్తావన తప్ప మతం ప్రస్తావన లేదు. ఇవి రెండూ వేరు వేరు నాగరికతలకు చెందినవి అంటే నేను నమ్మలేకపోతున్నాను.''

ఇలా వుండేవి ఆమె మాటలు.

వాళ్ళ కుటుంబంలో ఎవ్వరూ మాంసాహారం ముట్టేవారుకాదు. ఇదే విషయం ఒకసారి హకీంగారిని అడిగాను నేను.

''జీవహింస మహాపాపం'' అన్నారాయన.

''అదేమిటీ మీ మతంలో మాంసాహారం తప్పనిసరి అని విన్నానే'' అన్నాను నేను.

ఆయన చిరునవ్వు నవ్వి ''లేదు బాబు. చదువుకున్నవాడివి నీకు తెలియంది ఏముంది చెప్పు. ముస్లిం మతం అరేబియాలో పుట్టింది. అక్కడ ఎక్కువ ఎడారి ప్రాంతం కావడంవల్లా జనాలకు సరిపడా పంట పండదు. అందుకే జంతువులను ఆహారంగా తీసుకునేవారు. ఇక్కడ భరతఖండంలో దేవుడి దయవల్ల ఆహారానికి కొరత లేదు. ఇక్కడ మాంసాహారం భుజించాల్సిన అవసరం ఏముంది చెప్పు?'' అంటూ విశ్లేషించారు.

ఆడవారు గడప దాటరాదన్న సంప్రదాయానికి పూర్తి విరుద్ధంగా హకీంగారు. కాలంతోపాటు మనమూ మారాలి అంటూ మల్లికను చదివించారు. వయసు పెరుగుతున్నకొద్దీ మల్లిక అపరంజి బొమ్మలా రూపుదిద్దుకోసాగింది. ఆమెలోని అమాయకత్వమే ఆమెకు సగం అందం తెచ్చి పెట్టింది. ఆమెపట్ల నేను ఆకర్షితుడ్ని అవుతున్నట్లు నాకు తెలుస్తూనే వుంది. ఒకరోజు స్టడీ మెటీరియల్ కోసం నేను ఊరికి వెళ్లి వచ్చాను. వచ్చిన వెంటనే విషాద వార్త తెలిసింది. హకీంగారి భార్య ముంతాజ్‌మేగం పాముకాటువల్ల చనిపోయింది. అప్పుడు హకీంగారు నమాజు చదువుకుంటూ ఉన్నారుట. తోటలో నుంచి దారి తప్పి వచ్చిన పాము ముంతాజ్‌బేగంను కాటు వేసింది. తాను అరిస్తే ఎక్కడ

భర్త ఏకాగ్రత కోల్పోతాడేనన్న భయంతో ఆమె బాధను దిగమ్రింగుకుని వుండిట. హకీంగారు నమాజు పూర్తి చేసుకుని చూసేటప్పటికి ఈమె కొన ఊపిరితో ఉంది. అప్పటికప్పుడు డాక్టర్‌వద్దకు తీసుకెళ్లినా లాభం లేకుండాపోయింది.

హకీంగారు భార్య చనిపోయినా గంభీరంగానే ఉన్నారు. 'పుట్టించే హక్కు వున్న దేవుడికి, జీవి ప్రాణాలను తీసుకునే హక్కు కూడా ఉంది. మనందరం అద్దె కొంపలాంటి శరీరంలో వున్నాము. ఎప్పుడో ఒకప్పుడు ఈ అద్దె శరీరాన్ని వదిలి ఆత్మ పరమాత్మలో ఏకమవుతుంది. అందుకు మనం ఆనందించాలిగానీ బాధ పడకూడదు' అంటూ నేను ఏడుస్తుంటే వేదాంతం చెప్పుకొచ్చి నన్ను ఓదార్చారు.

మల్లికను ఓదార్చడం మాత్రం ఆయన తరంకాలేదు. చాలారోజులు ఆమె ఆ షాక్ నుంచి తేరుకోలేకపోయింది. అప్పుడు నేను ఆమెకు ఇంకా దగ్గరై ఎంతో ప్రయాసతో మామూలు మనిషిని చేసాను. హకీంగారు మల్లికకు పెళ్లి చేయాలని నిశ్చయించారు. వరుడి వేటలో పడ్డారు. కానీ అందుకు మల్లిక ఏమాత్రం ఇష్టపడలేదు. తాను ఇంకా చదువుకుంటానంది. అయితే ఆమె మనసులో నేనున్నానని హకీంగారికి తెలియదు.

నేనూ, మల్లిక ఇంట్లో లేని సమయంలో మా ఇంటి మీద నక్సల్స్ దాడి చేసారు.

నాన్నగారి పేరు ఎవరి హిట్‌లిస్టులోనూ లేకపోవడంవల్ల ఆయనకు పెద్దగా సెక్యూరిటీ ఉండేది కాదు. అందుకని నాన్నగారి మీద అటాక్ చేయడం వాళ్ళకు సులువయింది. అయితే వున్న ఒకరిద్దరు సెక్యూరిటీ గార్డ్స్ కాళ్లకు బుద్ధి చెప్పి పారిపోతే హకీంగారు మాత్రం నాన్నగారికి రక్షక కవచంలా నిలబడ్డారు. నాన్నగారికి తగలాల్సిన బుల్లెట్లన్నీ ఆనందంగా తాను తిన్నాడు. అప్పుడే పోలీసులు రావడంతో నక్సల్స్ పారిపోయారు. హకీంగారు మాత్రం అద్దె శరీరాన్ని వదిలి పరమాత్మలో ఏకమయినారు.

మల్లిక అనాధ అయిపోయింది. ఉమెన్స్ హాస్టల్‌లో వుండి చదువుకుంటోంది. హకీంగారు ముందు జాగ్రత్తగా ఆమె పేరుమీద పొదుపు చేసిన డబ్బే ఇప్పుడు ఆమెకు జీవనాధారం అయింది.

నాన్నగారు మరచిపోయినంత తేలిగ్గా నేను ఆ కుటుంబాన్ని మరచిపోలేకపోయాను. తరచూ మల్లికను కల్సుకుంటునే ఉన్నాను. ఆమె నాకు చిన్ననాటి స్నేహితురాలు అని మాత్రమే నాన్నగారికి తెలుసు. ఇప్పుడు ప్రియురాలు అయిందన్న సంగతి తెలిసి ఆయన నాపై విరుచుకుపడ్డారు. ఆయన మన పెళ్లికి అంగీకరించడన్న సంగతి నాకంటే ముందే మల్లిక ఊహించింది.

''శ్రీనూ! నేను మతం మార్చుకుంటాను. నీ కోసం, మన ప్రేమకోసం'' అంది.

''మల్లికా! మనం ఫలానా మతంలో పుట్టాలని దేవుడ్ని కోరుకోము. దేవుడికి ఇష్టమైన చోట మనల్ని పుట్టించాడు. ఇప్పుడు మతం మార్చుకునే అధికారం గానీ, ఇతరులను మతం మార్చుకొమ్మని చెప్పే హక్కు గానీ మనకులేదు. మనిద్దరిదీ ఒకే మతం. అదే ప్రేమ మతం. అది ఎంతో శక్తివంతమైనది. దాని ముందు రారాజులే తలలు వంచారు. వారికంటే మా నాన్న శక్తివంతుడు కాదు, అతీతుడు అంతకంటే కాదు'' అన్నాను నేను. ఆ మొండి ధైర్యంతోనే నాన్నగారికి మా ప్రేమ విషయం చెప్పాను. ఆయన ససేమిరా ఒప్పుకోనన్నారు.

''పట్టుదలలో నేను మీ వారసుడ్ని. మల్లికను తప్ప మరెవ్వరితోనూ జీవితాన్ని పంచుకోలేను'' అన్నాను నేను. ''పట్టుదలతో నువ్వు ఆ పని చేయదలిస్తే నా రాజకీయ వారసుడివి కాలేవు. నా ఆస్తిలో నీకు చిల్లిగవ్వ దక్కదు'' కోపంగా తేల్చి చెప్పేశారు నాన్నగారు.



మర్నాడు పార్కులో మల్లికను కలుసుకుని విషయం చెప్పాను.

''నీకు నాకంటే ఆస్తి ఎక్కువా?'' అడిగింది.

''కాదుగానీ మనం ఆయన్ని కాదని బయటకు వచ్చి బ్రతికేది ఎలా? నువ్వు నన్ను నమ్ముకుని వస్తున్నప్పుడు నేను నీకు ఏమాత్రం కష్టం కలగకుండా చూసుకోవాలిగా?'' అన్నాను.

''శ్రీనూ! మేడల్లోనే సుఖం ఉందనుకుంటే గుడిసెల్లోని వాళ్ళందరూ ఎప్పుడో ఆత్మహత్యలు చేసుకుని ఉండేవాళ్ళు. మనిద్దరి ఆప్యాయతే మనకు ఆస్తి, మన ఆత్మవిశ్వాసమే మనకు పెట్టుబడి.''

ఆమె చెబుతున్నది మౌనంగా వింటున్నాను నేను.

''నేనీ మాటలు ఆకర్షణతో, మైకంతో అంటున్నవి కావు. ప్రేమకూ, ఆకర్షణకూ తేడా తెలియని వయసు కాదు మనది. నువ్వు చదువుకున్నావు. నేనూ చదువుకున్నాను. ప్రయత్నిస్తే ఎవరికో ఒకరికి ఉద్యోగం రాకమానదు. ఆశ వున్న జీవి చావులో కూడా ఆనందాన్ని వెతుకుతాడు'' అంది.

''నీలో వున్న ఆత్మవిశ్వాసం చూడాలనే నేను ఆ విధంగా మాట్లాడాను. ఇక నా భయం తీరింది'' ఆమె నుదుటిమీద చుంబిస్తూ అన్నాను.

మరో నెలరోజుల్లో నేను ఉద్యోగం సంపాదించాను. నేను ఫలానా ఆయన కొడుకని తెలిసివచ్చిన ఉద్యోగం కాదది. కేవలం నా ప్రతిభతో, మల్లిక ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో సంపాదించింది. ఇక చివరిసారిగా నాన్నగారిని నా పెళ్లి విషయం అడిగాను.

''నేను నీకు ముందే చెప్పాను అది వీలు పడని విషయమని.'' నాకిప్పటికీ అర్థంకాదు. పిల్లలకోసం కొండ మీది కోతినైనా తెచ్చిచ్చే తల్లిదండ్రులు ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి మాత్రం ఎందుకు ఒప్పుకోరో?

నాన్నగారి నిర్ణయం మారదని అర్థమైపోయింది. అందుకే నా నిర్ణయం వినిపించాను.

''నాన్నగారూ! ప్రేమ త్యాగాన్ని కోరుతుంది. దాని కోసం నేను త్యాగం చేస్తున్నాను మీరిచ్చే ఆస్తినీ, హోదానీ, పలుకుబడినీ!'' అంటూ బయటకు నడిచాను. మరో రెండువారాల్లో మల్లికని రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నాను.

★